క్లుప్తంగా

డిగ్రీ కళాశాలకు రూ.3 లక్షలు మంజూరు

మక్తల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రత్యేకంగా రూ.3లక్షలు మంజూరు చేసినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. డిగ్రీ కళాశాలకు ఫర్నీచర్, బేసిక్ అవసరాల కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధుల నుంచి విద్యార్థులకు ఫర్నీచర్, కంప్యూటర్, ప్రింటర్, తదితర వాటిని కొనుగోలు కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాలకు నిధులు మంజూరు చేయడంపై కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

స్పోర్ట్స్ మెటీరియల్ అందజేత



నారాయణపేట ఎడ్యుకేషన్: మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50వేల స్పోర్ట్స్ మెటీరియల్ వచ్చినట్లు ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సునీత తెలిపారు. విద్యార్థులందరు స్పోర్ట్స్ మెటీరియల్‌ను ఉపయోగించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలన్నారు.

రెజ్లింగ్ చాంపియన్‌గా నాగలక్ష్మి

ధన్వాడ: మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థి నాగలక్ష్మి హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వీర్ తెలంగాణ కేసరి రెజ్లింగ్ పోటీలలో 55 నుంచి 65 కేజీల విభాగంలో చాంపియన్‌గా నిలిచిందని కోచ్ శ్రీనివాస్ తెలిపారు. అలాగే రెండో బహుమతి కూడా ఇదే పాఠశాలకు చెందిన గీత గెలుపొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత చేతుల మీదుగా టోక్యో ఒలంపిక్ మెడల్ అలాగే హనుమన్ గధను బహుమతిగా అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రత్యేక అధికారి గంగమ్మ, పీఈటీ సౌమ్యలు హర్షం వ్యక్తం చేశారు.

తప్పిన పెను ప్రమాదం

మరికల్: వరి ధాన్యం లోడుతో వస్తున్న లారీ విద్యుత్ తీగలకు తగలడంతో స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది. మరికల్ శివారులోని రైల్వే వంతెనపై వరి ధాన్యం ఓ ప్రైవేట్ వ్యాపారి కొనుగోలు చేసి కూలీలతో లారీలో లోడు చేశారు. వరిధాన్యం లారీ వెళ్తున్న క్రమంలో 11కేవీ విద్యుత్ తీగలు ధాన్యం బస్తాలకు తగిలి మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అందులో ఒక స్తంభం లారీపై పడగా కూలీలు కూడా అక్కడే ఉన్నారు. ఆ సమయంలో కరెంట్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పి ఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోస్గి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోని కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. మండలంలోని బిజ్జారం గ్రామానికి చెందిన వీరేశం మంగళవారం తెల్లవారుజామున బిజ్జారం వాగు నుంచి అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌లో నింపుకోని కోస్గికి తరలిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకోని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జోరుగా వరి కోతలు



మాగనూర్: మండల వ్యాప్తంగా వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఆరు నెలలు శ్రమించిన రైతు కష్టం పంట రూపంలో చేతికి అందుతోంది. మరో రెండు, మూడు వారాల్లో దాదాపుగా వరి కోతలు పూర్తవుతాయని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు ఈ యాసంగిలో వర్షాభావ దృష్ట్యా బోరుబావులు, చెరువులు, కాలువలు ఎండిపోవడంతో ఇప్పటికే వందలాది ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పంట నష్టం సర్వే చేయించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండలంలోని పలువురు రైతులు కోరుతున్నారు.

పుస్తె మెట్టెలు అందజేత

నారాయణపేట: ధన్వాడ గ్రామ నిరుపేద ముదిరాజ్ ఆడబిడ్డ పెళ్లికి జిల్లా కేంద్రానికి చెందిన అర్చన జ్యువెలర్స్ యజమాని, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజు పుస్తె మెట్టెలు అందజేశారు. పెళ్లి కుమార్తె సంద రాజేశ్వరికి తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ తనవంతుగా ఆర్థికంగా సహకరించారు. ఎమ్మెల్యే పీఏ చిట్టెం మాధవ రెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఎం.కాంతి కుమార్, మాజీ కౌన్సిలర్స్ ఎ.వినోద్ కుమార్, బి.మారుతి ఉన్నారు.

అంగన్‌వాడీలో పర్యవేక్షణ ఏదీ?

- నాసిరకం గుడ్లు సరఫరా
- పట్టించుకోని ఉన్నతాధికారులు



అమీన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఇలా..

ఊట్కూర్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం కృషి చేస్తున్నా, అధికారుల పరివేక్షణ లేక పోవడంతో ప్రభుత్వ ఆశయం నిరుగారుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా అవుతున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని అమీన్‌పూర్ గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రభుత్వ పాఠశాల అదనపు గదుల్లో ఒకటి, పాత పాఠశాల భవనంలో రెండో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతుండేది. కాగా 4 నెలల క్రితం పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రభుత్వ పాఠశాల భవనానికి మార్చారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే దగ్గర కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ–2 కేంద్రం పరిధిలో 20 మంది వరకు పిల్లలు ఉన్నా నిత్యం ఇద్దరు, ముగ్గురు పిల్లలు మాత్రమే వస్తున్నారు. ఎక్కువ మంది పిల్లలు వస్తున్నట్లు హాజరు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలోనే గర్భిణులు, బాలింతలకు వంటవండి పౌష్టికాహారం అందించాల్సి ఉండగా లబ్ధిదారుల ఇంటికి సరుకులు అందిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్న,చిన్న గుడ్లను సరఫరా చేస్తున్నారు. గుడ్లను తీసుకున్న లబ్ధిదారులు ఇదేమిటని టీచర్లను అడిగితే ఇలానే వస్తున్నాయి అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. సుమారు రెండు నెలలు కావస్తున్న సూపర్‌వైజర్ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించలేదని పలువురు తెలిపారు. ఈ విషయమై డీడబ్ల్యూఓ జయను వివరణ కోరగా విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అమీన్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన గుడ్లు

నాణ్యతగా భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న శివారెడ్డి

నారాయణపేట రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం విద్యార్థులకు నాణ్యతగా అందించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి సూచించారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామ యూపీఎస్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాస్తున్న ఎస్‌ఏ 2 పరీక్షలను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతిరోజు మెనూ ప్రకారం నాణ్యమైన వస్తువులతో భోజనం సిద్ధం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా భోజనం వండినా, విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్నబియ్యంతో నిరుపేదల ఆనందం



లక్కర్‌దొడ్డిలో సన్నబియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

నర్వ: తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం కార్యక్రమం నిరుపేదలు ఆనందంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్యసాగర్ అన్నారు. లక్కర్‌దొడ్డి గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ బియ్యం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నర్సింహ, నరేష్, పెద్ద మల్లేష్, తిరుపతయ్య, తిరుపతి, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఆశన్‌పల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి



కొత్తపల్లిలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు, అధికారులు



జక్లేర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ గవినోళ్ల రాధమ్మ



పుంజనూర్‌లో తేమను పరిశీలిస్తున్న ఏఈఓ శివ

నారాయణపేట రూరల్: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండ, అప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాతలకు ఎల్లవేళలా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో డైరెక్టర్ శరణప్ప, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సద్వినియోగ చేసుకోవాలి

దామరగిద్ద: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ శివారెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప అన్నారు. మండలంలోని పిడెంపల్లి, లోకుర్తి ఆశన్‌పల్లి గ్రామాల్లో సెర్ప్, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, రఘు, వెంకట్రామరెడ్డి, లక్ష్మణ్, ఖాజా, రాఘవేందర్‌గౌడ్, ఆయా గ్రామాల నాయకులు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొత్తపల్లి: దళారులను నమ్మి మోసపోవద్దని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తోందని పీఏసీఎస్ అధ్యక్షులు నర్సింహులు, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు తెలిపారు. మండలంలోని భూనీడు, గొర్లోనిబాయి, గోకుల్ నగర్, మన్నాపూర్, కొత్తపల్లి, నిడ్జింత గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, రమేశ్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పార్థివ గౌడ్, నీలారెడ్డి ఐకేపీ ఏపీఎం నారాయణ పాల్గొన్నారు.

జక్లేర్‌లో వరి కొనుగోలు కేంద్రం

మక్తల్: మండలంలోని జక్లేర్ గ్రామంలో డీఆర్‌డీఏ, ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మక్తల్ మార్కెట్ చైర్‌పర్సన్ గవినోళ్ల రాధమ్మ ప్రారంభించారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ మిథున్ చక్రవర్తి, మార్కెట్ డైరెక్టరు రంజిత్‌కుమార్, శ్రీనివాసులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం పరిశీలించిన అధికారులు

మాగనూర్: మండలంలోని పుంజనూర్ గ్రామంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వరిధాన్యంను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అడవిసత్యారం ఏఈఓ శివ మాట్లాడుతూ రైతులు వడ్ల తేమ శాతం 17 ఖచ్చితంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలంగాణ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్ కూడా అందిస్తుందన్నారు. తేమశాతం వచ్చిన రైతులకు టోకెన్లు అందజేశారు.

కనులపండువగా ఆదిదంపతుల కల్యాణం

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ ఊకచెట్టు వాగు సమీపంలో వెలసిన స్వయంభూ శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ఆది దంపతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు ఆది దంపతులను పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించి కల్యాణం జరిపించారు.

ప్రజల మన్ననలు పొందాలి

- ఎస్పీ యోగేష్ గౌతమ్



మరికల్: విధి నిర్వహణలో పోలీసులు ప్రజల మన్ననలు పొందేలా ఉండాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. మంగళవారం మరికల్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీసుల విధి నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సీఐ రాజేందర్ రెడ్డి, ఎస్‌ఐ రామును అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను తర్వగా దర్యాప్తు చేసి పరిష్కరించాలన్నారు. పోలీస్ శాఖ అత్యంత బాధ్యతయుతమైన వ్యవస్థ, ప్రతి ఒక్కరు అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. కఠిన నేరాస్తులకు కోర్టులో శిక్ష పడేలా దర్యాప్తు ఉండాలని తెలిపారు. చోరీలు జరగకుండా గస్తీ నిర్వహించి ప్రజల మెప్పు పొందాలన్నారు. సైబర్ నేరాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీసులదే అన్నారు.

కల్లాలుగా క్రీడాప్రాంగణాలు



మాగనూర్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో చేపట్టిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు సరైన వసరులు, నిర్వహణ, వసతుల్లేక వెలవెలబోతున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక అధికారులు చేతులెత్తయడంతో ప్రస్తుతం ఆవి రైతులకు కల్లాలుగా మారాయి. మండలంలోని నేరడగం గ్రామంలో ఏర్పాటు చేసిన కీడా ప్రాంగణం గ్రామానికి కిలోమీటర్ మేర దూరం ఉండటంతో క్రీడాకారులకు అందుబాటులో లేకుండా పోయింది. గ్రామానికి చెందిన కొందరు రైతులు క్రీడాప్రాంగణంలో వరి ధాన్యం రాసులు వేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్రీడా ప్రాంగణంలో సరైన వసతులు కల్పించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి

- ఎంపీ డీకే అరుణ సమక్షంలో 30 మంది బీజేపీలో చేరిక
- గ్రామాల్లో బీజేపీ జెండావిష్కరణ



కన్మనూర్‌లో బీజేపీ జెండావిష్కరణలో పాల్గొన్న ఎంపీ అరుణ

మరికల్: మండలంలోని కన్మనూర్, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో ఎంపీ డీకే అరుణ బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో ఇతర పార్టీలకు చెందిన 30 మంది నాయకులు ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరగా, వారికి కండువా లు కప్పి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల లోపు గ్రామ స్థాయిలో పార్టీని పటిష్టంగా చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్, నర్సన్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, వేణు. రమేష్, సూరి, తిరుపతిరెడ్డి, శ్రీరామ్, విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిపథ్ ఎంపికైన యువకుడికి ఎంపీ సన్మానం

మరికల్ మండల కేంద్రానికి చెందిన బోయ మోహన్ ఇటీవల వచ్చిన ఫలితాల్లో అగ్నిపథ్‌కు ఎంపిక కావడంతో ఎంపీ డీకే అరుణ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం యువత ముందుకు రావాలన్నారు. మోహన్‌ను ఆదర్శంగా తీసుకొని యువకులు అగ్నిపథ్‌లో ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించా రు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సత్యయాదవ్, వేణు, నర్సన్ గౌడ్, నర్సింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయి



అమీన్‌పూర్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

ఊట్కూరు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్ రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అమీన్‌పూర్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో, యువకుల్లో పట్టుదల, క్రమశిక్షణ కలుగుతాయ న్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. మొదటి బహుమతి అంబేద్కర్ జట్టుకు ఎస్ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు శివారెడ్డి, సుధాకర్‌రెడ్డిలు రూ.22,222 నగదు అందించారు. ద్వితీయ బహుమతి ఛత్రపతి శివాజీ జట్టుకు హన్మిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు రవీందర్‌రెడ్డి, ఆశిరెడ్డిలు రూ.11,111 నగదు అందించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, సలీం, ఎస్ సుధాకర్ రెడ్డి, భీంసేన్, మల్లేష్, మైబూబ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ పనులు పరిశీలించిన ఆర్‌అండ్‌బీ డీఈ



బీటీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ రాములు



మన్నాపూర్- అల్లీపూర్ మధ్యలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తపల్లి: మండలంలో కొనసాగుతున్న డబుల్ రోడ్డు బీటీ పనులను మంగళవారం డీఈ రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో లింగాల్ చేడ్ నుంచి మద్దూరు వరకు 15.05 కిలోమీటర్లకు రూ.39 కోట్లతో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులను మన్నాపూర్ కొత్తపల్లి మధ్యలో పరిశీలించారు. మన్నాపూర్ అల్లీపూర్ మధ్యలో వాగుపై రూ.8 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. బీటీ రోడ్డు పనులలో నాణ్యత పాటించాలని పీఏసీఎస్ అధ్యక్షులు నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, మహేందర్ రెడ్డి, రమేశ్ రెడ్డి, జంగం బాబు, నరేశ్ యాదవ్, తిరుపతిరెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వేద పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ వేద పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణపేట డీఈఓ గోవిందరాజులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు నరహరి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడారు. ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీనికి వీరుద్ధంగా వేద పాఠశాల తరగతులు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు పాఠశాలకు సెలవు ప్రకటించి తరగతి గదులను బహిష్కరించాలని కోరగా వారు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరించి, అసలు తమకు అంబేద్కర్ ఎవరో తెలియనట్లు ప్రవర్తించారు. పైగా విద్యార్థి సంఘాల నాయకులపై పోలీస్ కేసు పెట్టడం సరైన వైఖరి కాదన్నారు. ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహించిన వేద పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పిదాలు చేస్తే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో భారీ ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు కృష్ణ, నితిన్, రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు నరేష్ పాల్గొన్నారు.

తైబజార్‌లో తప్పని తిప్పలు

- గొడుగు నీడలో సంత
- సదుపాయాలు లేక చింత
- రోడ్డు పైనే విక్రయాలు
- స్థల పరిశీలనకే పరిమితమవుతున్న అధికారుల చర్యలు



ఎండకు గొడుగులు కప్పుకున్న చిరు వ్యాపారులు

దామరగిద్ద: మండల కేంద్రమైన దామరగిద్దలో తైబజార్‌లో సదుపాయాల లేమీతో తిప్పలు తప్పడం లేదు. ఏళ్లుగా తైబజార్ నిర్వహణకు ప్రత్యేక సదుపాయం లేక చిరువ్యాపారులు ఎండైనా, వానైనా గొడుగు నీడలో కూర్చొని వ్యాపారాన్ని చేయాల్సిన దుస్థితి ఉంది. ప్రతి మంగళవారం నిర్వహించే తైబజార్ నిర్వహణతో గ్రామ పంచాయతీకి ఆదాయం వస్తున్న సదుపాయాల కల్పన మాత్రం చేపట్టడం లేదు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా మార్కెట్ సదుపాయాల కల్పనలో పెద్దగా మార్పు రాలేదు. మార్కెట్ సదుపాయం లేక చిరు వ్యాపారులు అవస్తలు పడుతున్నారు. గతంలో ఇరుకు రోడ్డు ఉండగా రోడ్డు విస్తరణతో ప్రధాన రహదారిలో రాకపోకలకు సౌకర్య కల్గింది. ప్రస్తుతం ఎస్‌బీఐ బ్యాంక్ ముందు రోడ్డు నుంచి నగరేశ్వర ఆలయం వరకు ఇరుకైన మట్టి రోడ్డు పై ఇరువైపుల సంతబజార్ నిర్వహిస్తున్నారు. ఎలాంటి షెడ్లు లేకపోవడంతో ఎండ నుంచి రక్షణకు గొడుగులు, టార్పలిన్ కవర్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇరుకు రోడ్డుపై ఇరువైపుల వ్యాపారులు కూర్చోవడంతో కొనుగోలుదారులు సైతం ఇరుకు స్థలంలో ఇబ్బందులు పడుతూ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి వ్యాపారి రూ.30 రుసుం చెల్లిస్తున్నారు. ఏటా గ్రామ పంచాయతీకి లక్షల రూపాయలు వేలం పాట ద్వారా ఆదాయం సమకూరుతున్నా, సరైన మార్కెట్ స్థలాన్ని గుర్తించి సదుపాయం కల్పించక పోవడంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలుదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎలాంటి సదుపాయం లేదు



ప్రతి మంగళవారం కూరగాయలు అమ్మేందుకు మద్దూర్ నుంచి ప్రతివారం వస్తాను. సంతబజార్‌లో ఎలాంటి సదుపాయం లేదు. ఎండలకు తట్టుకోలేక గొడుగుల కింద కూర్చొని కూరగాయలు అమ్ముకుంటున్నాం. మార్కెట్లో కూరగాయలు అమ్ముకున్నందుకు రూ.30 మార్కెట్ ఫీజు కడుతున్నాం. సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

– అంజమ్మ, కూరగాయల వ్యాపారి

చిరువ్యాపారులను ఆదుకోవాలి



ఉపాధి కోసం రోజుకో ఊళ్లో జరిగే సంతలో వ్యాపారం చేసుకునే మాలాంటి వ్యాపారులను గుర్తించి ఆదుకోవాలి. ఏ గ్రామానికి వెళ్లినా మార్కెట్ సదుపాయం లేదు. ఇరుకు రోడ్లపై మండుటెండల్లోనే వ్యాపారం చేసుకుంటున్నాం. అధికారులు మార్కెట్ నిర్మాణం చేపట్టి సదుపాయం కల్పించాలి.

– వెంకటేష్, కూరగాయల వ్యాపారి

స్థల పరిశీలన చేస్తున్నాం..



మార్కెట్ సదుపాయం కోసం గతంలో కలెక్టర్ ఆదేశాలతో స్థల పరిశీలన చర్యలు చేపట్టినట్లు తెలుసు. మార్కెట్ నిర్వహణకు సంబంధించి గ్రామ పంచాయతీ అధికారి ద్వారా సమాచారం తీసుకొని రెవెన్యూ అధికారులుతో కలిసి గ్రామ పరిధిలో అనువైన స్థలాన్ని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాయిలక్ష్మి, ఎంపీడీఓ దామరగిద్ద